రమణ జుట్టు పట్టుకుని వీపుమీద నాలుగు దెబ్బలేశాడు.

తప్పు చేసినట్టు వెంటనే రమణను పట్టుకుని ఏడ్చేశాడు. నిజానికి అతనికి భార్యంటే చాలా ప్రేమ.

'ఇన్నాళ్లయినా పిల్లలు పుట్టట్లేదు. దాన్నొగ్గేసి మారు మనువు చేసుకో!' అంటూ అతని తల్లి పోరుపెట్టినా.. రమణపై ప్రేమ కాస్తయినా తగ్గనీయలేదు.

ఏనాడూ చిన్నమాట అనని సైదులు, ఆమెపై చేయి చేసుకున్నందుకు తన చేతకానితనానికి



కుమిలిపోతూ కూర్చుండి పోయాడు.

కూతుర్ని పోగొట్టుకున్న అతనికి లోకమంతా చీకటి అయిపోయినట్టు.. ఎవర్నీ నిందించలేని నిస్సహాయ స్థితిలో తప్పంతా భార్యపై నెట్టేశాడు. పాపం.. ఆ పిచ్చితల్లి అతనన్న మాట నిజమే అనుకుంటూ..

''నా బుజ్జిని నానే చంపేసినాను.. నా బుజ్జిని నానే చంపేసినాను'' అంటూ రోడ్డు మీదికి పరుగెట్టుకుంటూ వెళ్లింది. అప్పుడే అట్నుంచి స్పీడుగా వచ్చిన బస్సు.. ఆమెను బలంగా ఢీకొట్టింది. అంతే.. చూస్తుండగానే ప్రాణాలొదిలేసింది రమణ.

అక్కడున్న వారంతా బస్సు డ్రైవర్‌పై కేసు పెడదామన్నారు. కానీ, సైదులు నిరాసక్తిగా..

''ఏ కేసూ వద్దు. పెట్టినా నావోళ్లు తిరిగిరారుగా స్టేసను చుట్టూ తిరిగే ఓపికనేదు. పెళ్లాం బిడ్డల్ని కూడ సరిగ్గ చూసుకోలేని సేతకానోడ్ని చేసాడా దేవుడు. ఒగ్గేయండి.. నా బతుకే బుగ్గయిపోనాది'' అంటూ, రాళ్లగుట్ట వైపూ.. రోడ్డు వైపూ పిచ్చివాడిలా చూస్తూ ఉండిపోయాడు.

డ్రైవర్ల నిర్లక్ష్యానికి ఓ కుటుంబం మూల్యం చెల్లించాల్సి వచ్చింది.

ఈలోపు కరోనా కలకలం మొదలయింది. భవన నిర్మాణాలు ఆపేశారు. 'లాక్‌డౌన్' ప్రకటించారు. పది రోజులు గడిచినా, పరిస్థితి మారలేదు. అందరికి చేతిలో ఉన్న డబ్బులు ఖర్చయి పోయాయి. బయటికెళ్తే పోలీసులు కొడుతున్నారు. అప్పటికే కరోనాతో జనాలు పిట్టల్లా రాలిపోతున్నారు. అందరి గుండెల్లో భయం మొదలయింది.

'ఈ రోగం అంటుకుని ఊరుగాని ఊర్లో చచ్చిపోతామేమో! ఎలాగోలా సొంతూళ్లకు వెళ్లిపోవాలి' అని అందరూ నిర్ణయించుకున్నారు. తెచ్చుకున్న వంట సామగ్రి అక్కడే వదిలేసి, మోయగలిగినన్ని బట్టలు మాత్రం బ్యాగుల్లో సర్దుకుని బయల్దేరారు.

సైదులు రానని ఏడుస్తున్నా.. ఒక్కణ్ని వదిలేయలేక బలవంతంగా బయల్దేరదీశారు.

రోడ్డు మీద ఒక్కవాహనం కూడా లేక నడక మొదలు పెట్టారు. పోలీసులు అడ్డగించి.. అందర్నీ కలిసి నడవద్దనీ, దూరం దూరంగా నడవమనీ చెప్పారు. కొందరు పొగరుగా ఉన్న పోలీసులైతే.. దగ్గరగా నడిచినా, మాస్క్ సరిగ్గా పెట్టుకోకపోయినా లాఠీలకు పని చెప్పేవారు. దాహం వేసి ఏ ఇంటి తలుపు తట్టినా తీసేవారు కాదు. తీసినా.. ఏ సహాయం చేసేవారు కాదు.

''మనుసుల్లో మానవత్వమే లేకుండా పోయింది. కనీసం నీళ్లయినా ఇవ్వట్లేదు'' అని కొందరంటే..

''మానవత్వం లేక కాదు. ఈ పరిస్థితుల్లో అంతకు మించి సావు భయం ఎక్కువగుంది'' అని కొందరు సరిపెట్టుకునే వారు.

దారిలో ఎవరైనా దయతలచి మంచి నీళ్ల పాకెట్లు, పులిహోర పాకెట్లు పంచితే.. జీవితంలో ఎప్పుడూ ఆహారం తిననట్టుగా ఆబగా తినేవారు.

ఎండవేడికి తట్టుకోలేని వాళ్లు ఏ చెట్లకిందో సేద దీరేవారు. నడిచి నడిచి కాళ్లకు బొబ్బలెక్కితే.. కాళ్లకు గుడ్డలు కట్టుకుని నడిచేవారు. ఎంత దూరం నడిచినా దూరం తరిగేది కాదు. స్వర్గం, నరకం అన్న రెండిటిలో నరకమన్నది భూమ్మీదే అనుభవమైంది వారికి.

ఓ సినిమా నటుడు తన సొంతడబ్బుతో వలస కార్మికుల కోసం బస్సు వేస్తున్నారని విని.. అంతా తమ కష్టాలు తీరిపోయినట్టేనని సంబరపడిపోయారు. కానీ, వారి దాకా ఏ బస్సూ రాలేదు.

సరైన తిండి, నిద్ర లేకుండా రోజుల తరబడి నడుస్తూ జీవన పోరాటం చేస్తున్న వారి మానవత్వానికి సవాలులా.. వారితోపాటు వస్తున్న మంగవేణి కూతురు అమ్ములు కడుపు పట్టుకుని..

''ఓమ్మో ఓమ్మో! కడుపు నొస్తుంది..'' అంటూ కూర్చుండిపోయింది.

''బిడ్డా! లే బిడ్డా! అందరు పోతుండ్రు. మనం ఎనకయిపోతాం. జర ఓపిక జేసుకుని నడు బిడ్డా..'' అంటూ కూతుర్ని బతిమాలింది మంగవేణి.

''లే.. అమ్మా! నాతోటిగాదు. మస్తుగ కాళ్లు పీకుతుంటే ఎట్ల నడిచేది. మీరు బోండి. నేనిడ్నే ఉంటా..'' అంటూ నొప్పితో విలవిల్లాడింది అమ్ములు.

ఆ తల్లికి ఏం చెయ్యాల్లో తోచక.. కూతుర్ని ఎత్తుకోడానికి ప్రయత్నించింది. కానీ, పన్నెండేళ్ల పిల్ల బరువును మోస్తూ నడిచే బలం ఆమెకు లేక విఫలమైంది.

''అన్నా! ఎవరన్నా సాయం జేయండే! బిడ్డను కాసింత దూరం ఎత్తుకోండే! దండం పెడతా..'' అంటూ మగవాళ్లందర్నీ అడిగింది. కానీ, సైదుల్ని మాత్రం అడగలేదు. ఎందుకంటే ఆమెకు తెలుసు.. ఈమధ్య సరిగా తిండి తినక, అతను నీరసంగా ఉన్నాడని.

''ఈ బేగులనే మోస్తూ నడవలేకపోతున్నాం. ఇంక పిల్లనెలగ మోసేది. మావల్ల కాదమ్మ'' అంటూ ముందుకెళ్లి పోతున్నారు. సాయం చెయ్యాలని ఉన్నా.. అప్పటికే అలసిపోయి కాదని చెప్పేశారు.

''జర దయుంచండన్నా! మీ బిడ్డే అనుకోండన్నా..'' అంటున్న మంగవేణి మాటలకు.. ఠక్కున ఆగిపోయాడు సైదులు.

'బిడ్డ' అన్నమాట అతని చెవిన పడగానే.. కాలు ముందుకు వెయ్యలేకపోయాడు.

''మంగొదినా నేనెత్తుకుంటా!'' అంటూ అమ్ములు దగ్గరకెళ్లి కూర్చుని.. తన భుజంమీద ఎక్కించుకుని, లేచి నడవడం మొదలుపెట్టాడు.

కొంతదూరం నడిచేసరికి ఆగాడు. భుజం మీద వెచ్చగా, తడిగా అనిపించి చూసుకున్నాడు.

అతని అంగి జేబు వరకు కారిన రక్తపు మరకను చూసి.. ఒక్కసారిగా భయపడి..